# మాకు ఆకలి వద్దు బాబోయ్!

- పోలు మోహనరెడ్డి

మానవులు తమకు లేనిదాని కోసం ఆరాటపడతారు, తపిస్తారు. దేవతలు కూడా అంతే!

• • •

కైలాసంలో పార్వతీదేవి కిచెన్‌లోకి, హాల్‌లోకి అసహనంగా తిరుగుతోంది. ఆమె చూపులు ద్వారంవైపే ఉన్నాయి. నంది కోసం ఎదురు చూస్తోందామె. ఈవేళ ఉదయం వంటగదిలోకి వెళ్లిన వెంటనే కాఫీపొడి డబ్బా ఖాళీగా కనిపించింది. నిన్న సూపర్‌మార్కెట్ నుండి కాఫీపొడి తెప్పించుకుందామనుకుని మరచిపోయింది. ఇంత ఉదయమే సూపర్‌బజార్ ఓపెన్ చేయరు. కాఫీ తాగకపోతే పరమశివుడు ఎంత అశాంతిగా ఉంటారో, అసహనంగా ఉంటారో తనకు తెలుసు. పార్వతీదేవి ఆలోచనలో పడింది.

''నందీ ఇలారా!'' పిలిచింది పార్వతి.

''కైలాసంలో కాఫీపొడి నిండుకుంది. ఈ గిన్నె తీసుకువెళ్లి సరస్వతి మాతను అడిగి కాఫీపొడి తీసుకురా. సాయంత్రం తిరిగి ఇచ్చేస్తానని చెప్పు'' అంది.

ఇంద్రలోకం నుండి ఇంద్రుడు కామధేనువు నుండి తీసిన క్షీరాన్ని ప్రతిరోజూ రెండుపూటలా పంపుతాడు. పాలు కాచి, కాఫీపొడి తేవడానికి వెళ్లిన నంది కోసం ఎదురుచూస్తూ కిచెన్‌లోకి, హాలులోకి పచార్లు చేస్తోందామె. బ్రహ్మలోకం నుండి నంది సరస్వతీదేవిని అడిగి తీసుకువచ్చిన కాఫీ పొడి గిన్నె అందుకుంది. ఫిల్టర్ వేసింది.

పరమశివుడు నిద్ర లేచే వేళ అయింది. ఆయన బ్రష్ చేసుకుని వచ్చేలోగా కాఫీ రెడీ చేయాలి. కాఫీ కప్పు చూడగానే పరమేశ్వరుడు ప్రసన్నంగా నవ్వుతారు. ఆ చిరునవ్వు చూస్తేనే తనకు కొండంత రిలీఫ్ కలుగుతుంది. సదాశివునికి కాఫీ ఇచ్చి తను కూడా కొంచెం త్రాగితే ప్రాణం కుదుటపడుతుంది. పని చేయాలన్న హుషారు కలుగుతుంది.

ఈపూట వంట ఏమి చేయాలా అని హైమవతి ఆలోచనలో పడింది. ఈ రోజు శుక్రవారం. తనకు పాయసం అంటే చాలా ఇష్టం. భూలోకంలో భక్తులు కొందరు తనకు పాయసాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. కానీ అందరివద్దా తాను ఆ నైవేద్యాన్ని రుచి చూడదు. శుచిగా, శుభ్రంగా పాయసం తయారు చేసి మనస్ఫూర్తిగా అతి కొద్దిమంది ప్రియభక్తులు సమర్పించే నైవేద్యంలో నుండి తాను చూపుడువేలుతో కొంచెం తీసుకుంటుంది. అంతే! అంతకంటే ఎక్కువ తీసుకుని తింటే భక్తులకు చాలదేమో అనే భావంతో చాలా కొద్దిగా తింటుంది. కానీ ఇప్పుడు తాను పాయసం తయారుచేస్తే కడుపారా తృప్తిగా తినవచ్చు అనుకుని పాయసం తయారు చేయడానికి కావాల్సిన వస్తువులు అన్నీ సిద్ధంచేసి ఒక పక్కగా పెట్టుకుంది పార్వతీదేవి. వంట ఏం చేయాలా అని ఒక్క నిముషం ఆలోచించి కుక్కర్‌లో పప్పు పెట్టింది. నందీశ్వరుని భార్యకు కూరగాయలు ఇచ్చి వాటిని తరగమని చెప్పింది. స్వయంగా భార్య వంట చేస్తేనే పరమశివుడు ఇష్టంగా భోజనం చేస్తారు. అందుకని పార్వతీదేవి స్వయంగా వంట చేస్తుంది.

పరమేశ్వరుడు బ్రష్ చేసుకుని వచ్చి డైనింగ్ టేబుల్ వద్ద కూర్చున్నాడు. మెడలో ఆడుకుంటూ వయ్యారంగా చుట్టుకుంటున్న నాగులను సరి చేసుకున్నాడు. కుడిచేతికి అరవంకెగా చుట్టుకునివున్న పిల్లనాగు అల్లరి ఎక్కువగా చేస్తుంది. కుదురుగా ఉండదు. చేతిమీద అటూ ఇటూ తిరుగుతూ చక్కిలిగింతలు పెడుతుంది. పిల్లనాగును ప్రేమగా మందలించి సరిగా చేతికి చుట్టుకున్నాడు నాగభూషణుడు.

పార్వతీదేవి ఇచ్చిన కాఫీ కప్పును చిరునవ్వుతో అందుకున్నాడు. కిచెన్‌లోకి వెళ్లి ఆమె కూడా కాఫీ కప్పు తెచ్చుకుంది. కాఫీ త్రాగబోతుండగా నారదుడు వచ్చాడు. అతని నమస్కారాలు అందుకున్నారు పార్వతీ పరమేశ్వరులు.

ఉదయం పూట ఇంటికి వచ్చిన అతిథికి కాఫీ ఇవ్వడం మర్యాద కనుక, తన చేతిలోని కాఫీ కప్పును నారదునికి అందించింది పార్వతీదేవి. తన వీణ మహతిని ప్రక్కనపెట్టి గభాల్న కప్పు అందుకున్నాడు నారదుడు.

''మాతా! కాఫీ తయారుచేయడం ఇప్పుడు మీకు బాగా అలవాటైనట్లుంది. అద్భుతంగా ఉంది మీ చేతి కాఫీ'' అంటూ ఖాళీ కప్పు టేబుల్‌మీద పెట్టాడు నారదుడు.

''కాఫీ రుచి గురించి, భూలోకపు వంటలు, ఆంధ్రుల పిండివంటల మాధుర్యాన్ని దేవతలకు రుచి చూపించిన ఘనత నీదేకదా నారదా!'' అన్నాడు పరమశివుడు.

రెండునెలల క్రితం జరిగిన సంఘటనలు వారికి గుర్తుకొచ్చాయి.

తరచుగా భూలోకాన్ని సందర్శించి వచ్చే నారదుడు పనికట్టుకుని దేవతలందరి వద్దకు వెళ్లి కవ్వించాడు. భూలోకంలో మానవులు ఎన్నోరకాల పిండి వంటలను చేసుకుని సుష్టుగా ఆరగిస్తారని, వారి జిహ్వను సంతృప్తిపరచుకోగలుగుతున్నారని, అది ఎంతో అదృష్టమని దేవతలను ఊరించాడు. కానీ దేవతలు మాత్రం అమృతాన్ని సేవించడంవల్ల వారికి ఆకలి, జిహ్వా చాపల్యం కలగడంలేదని, నారదుడు బాధపడి టన్నులకొద్దీ సానుభూతి కురిపించాడు.

నారదుని మాటలు విన్న దేవతలందరూ తాము అమృతాన్ని సేవించి అమరత్వాన్ని పొందినప్పటికీ మానవులు భుజిస్తున్న మధురమైన ఆహార పదార్థాలను తాము తినలేకపోతున్నందుకు, తమకు ఆకలి కలగనందుకు ఎంతగానో బాధపడ్డారు. అపురూపమైన వరాన్ని కోల్పోయినట్టు దేవతలు కలత చెందారు. అమృతాన్ని సేవించకముందు ఫలాలు భుజించేవారు. ఇప్పుడు ఆ అవసరం కూడా లేకపోయింది.

రాక్షసులను మాయచేసి మోహినీ అవతారంలో తమకు అమృతాన్ని అందించిన విష్ణుమూర్తిని దేవతలందరూ తిట్టిపోసారు. ఆ తిట్లు అన్నింటినీ నారదుడు విష్ణుమూర్తికి చేరవేసాడు. విష్ణుమూర్తికి వల్లమాలిన కోపం వచ్చింది. ఫలితంగా వైకుంఠంలో అత్యవసర సమావేశం ఏర్పాటుచేసారు. దేవతలందరూ సమావేశానికి హాజరయ్యారు. త్రిమూర్తులు, వారి సతీమణులు వేదిక మీద ఆసీనులయ్యారు.

అమృతాన్ని సేవించడంవల్ల తమకు ఆకలి కలగడంలేదని, కానీ మానవులు భుజించి సేవించే ఆహార పానీయాల రుచిని ఆస్వాదించాలన్న ప్రగాఢమైన కోరిక తమకు కలుగుతోందని దేవతలందరూ ముక్తకంఠంతో అరిచారు.

దేవతలపై అమృతం యొక్క ప్రభావాన్ని తొలగింపజేస్తామని, ఫలితంగా ఆకలిదప్పులు కలుగుతాయని విష్ణుమూర్తి అన్నాడు.

జ్ఞానవతి, వివేకవతి, ధవళ వస్త్ర శోభిత అయిన సరస్వతిదేవి నోరు తెరిచి ఏదో చెప్పబోయింది. అదే సమయంలో భార్యవైపు చూసిన బ్రహ్మదేవుడు ఆమె మనోభావాలను అర్థం చేసుకున్నాడు.

''అమృతం యొక్క ప్రభావాన్ని మనపై తొలగించ డంవల్ల కలిగే పరిణామాలను ఎదుర్కోవడానికి మీరందరూ సిద్ధంగా ఉన్నారా?'' ప్రశ్నించాడు బ్రహ్మదేవుడు.

''మేము సిద్ధంగా ఉన్నాం. మాకు ఆకలి కలగాలి. ఆకలి తీరడానికి భోజనం చేయాలి. రకరకాల పిండి వంటలు తినాలి. ముఖ్యంగా ఆంధ్రుల పిండివం టలు రుచి చూడాలి. అదే మా కోరిక'' దేవతలం దరూ కోరస్‌గా అరిచారు.

''అయితే ఆకలి తీర్చుకునే విషయంలో మాత్రం మనం దైవత్వాన్ని కోల్పోయి సాధారణ మానవులవలె ఎంతో శ్రమించి ఆహారాన్ని సమకూర్చుకోవాలి. అందుకు మీరు సిద్ధమేనా?'' అడిగాడు విష్ణు మూర్తి.

''మంచి ప్రశ్న వేసావు'' అంటూ కైలాసపతి, వైకుంఠపతివైపు ప్రశంసగా చూసాడు రేడియోలో వచ్చే పరిచయ కార్యక్రమంలో ఇంటర్‌వ్యూ చేయ బడే వ్యక్తి పరిచయకర్తను మెచ్చుకున్నట్లుగా.

''మీరు చెప్పిన కండిషన్‌కు మేము సిద్ధమే. అయితే ఆకలి, దాహం కలగడం, కష్టించి ఆహా రాన్ని సమకూర్చుకోవాలనే నిబంధన మనందరికీ వర్తించాలి. ఎవరికీ మినహాయింపు ఉండకూడదు' అన్నారు రెండోవరుసలో కూర్చున్న ఇరువురు దేవ తలు లేచి నిలబడి.

''అవును అంతే'' అన్నారు దేవతలందరూ ముక్త కంఠంతో.

''సరే! రేపు ఉదయం 7 గంటలకు అందరూ ఇక్కడే సమావేశం కావాలి. త్రిమూర్తులు తమ శక్తిని వినూత్న రీతిలో బహిర్గతం చేసి ఆ శక్తి సమ్మేళనంతో ఇక్కడ హాజరైన దేవతలపై అమృతం ప్రభావాన్ని తొలగింపజేస్తారు'' చెప్పింది పార్వతీదేవి.

''వెనువెంటనే మనకు కూడా సామాన్య మానవుల వలె ఆకలిదప్పులు కలుగుతాయి. జిహ్వను సంతృప్తి పరచుకోవడానికి, ఆకలి తీర్చుకోవడానికి మనం తాప త్రయపడవలసి వుంది'' సరస్వతిదేవి వివరించింది.

తమ కోరిక తీరబోతున్నందుకు దేవతలందరూ హర్షధ్వానాలుచేసారు.

ఆ మర్నాటినుంచి దేవతలకు కష్టాలు ప్రారంభమ య్యాయి. ఇష్టపడి, కోరి, తొందరపాటుతనంతో త్రిమూర్తులను వేధించి దేవతలు కొనితెచ్చుకున్న కష్టాలు అవి.

అమృతం ప్రభావం తొలగిన వెంటనే దేవతలంద రికీ విపరీతమైన ఆకలి కలిగింది. కైలాసంలోని శీతల వాతావరణానికి ఏపుగా పెరిగిన యాపిల్ వృక్షాలకు కోసిన పండ్లు అంతక్రితం నేలరాలి, మంచులో కల సిపోయేవి. కానీ ఇప్పుడు ఆ యాపిల్ పండ్లు వారి ఆకలిని వెంటనే తీర్చాయి. కొద్దిమొత్తంలో వున్న కమలాపండ్లు కూడా దేవతలు స్వాహా చేసారు. దేవతలు అంటే స్త్రీలు, పురు షులు... ఇరువురూ ఉంటారు సుమా!




## ఇసుక మేడలు

మామూలుగా మనం ఎన్నో అంతస్థుల మేడలు కడుతుంటాం. ఆపై గాలిమేడలు, నీటి మేడలు ఊహల్లో కట్టేస్తాం. అదీ మీకు తెలిసిందే! అయితే ఇసుక మేడల గురించి తెలుసా మీకు? తెలీదు కదూ! అయితే తెలుసుకోండి. ఇటీవల బెల్జియంలో ఇసుక, నీరుని ముడి పదార్థంగా చేసుకుని ఇసుక మేడలు కట్టారండి జనం. దేముడి కంటే తామే గొప్ప అని చెప్పుకునే బెల్జియం ప్రజలు అందమైన బీచ్ ఒడ్డున 46 అడుగుల ఎత్తున్న ఇసుక మేడల్ని కట్టి ప్రజల్ని ఆశ్చర్యపరిచారు. 75 మంది శిల్పులు అత్యంత పొడవు, వెడల్పు వున్న ఈ ఇసుక మేడల్ని కట్టి ఆనందించారు. ప్రతి యేటా జరిగే ఉత్సవాలకి ఇలా కట్టడం అక్కడి వారి ఆనవాయితీ. నెల రోజుల తర్వాత బాణాసంచా కాల్చి ఆనందంగా పండుగ చేసుకుని వాటిని కూలదోస్తారు. కానీ కష్టపడి కట్టిన ఆ మేడల్ని కూల్చేప్పుడు సెంటిమెంట్‌గా ఏడుస్తారట కూడా! అయినా వాళ్ళకిదేం సరదానో కదా!

## తలలో శూలం

సాధారణంగా నాలుకలో శూలం గుచ్చుకోవడం, బుగ్గపై శూలం పొడుచుకోవడం మనం గ్రామాల్లో చూస్తుంటాం. కానీ తలలోనే శూలం గుచ్చుకున్న వ్యక్తి గురించి మీకు తెలుసా? ఓ ఇరవై ఏళ్ళ కుర్రాడు తలలో శూలం గుచ్చుకొని అర్జెంటీనాలో అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఏమాత్రం నెత్తురు బయటికి రాలేదుట. ఆరు గంటల ఆపరేషన్ తర్వాత అతని తలలోని శూలాన్ని డ్యాక్టర్ న్యూరోసర్జన్ బయటకి తీసాడట. ఏమాత్రం కాస్త పక్కన తగిలినా ప్రాణాలు పోయేవని, అయినా ఇదేం సరదా అని చీవాట్లు పెట్టారట డ్యాక్టర్లు. కానీ ప్రెస్‌కి అతని పేరు చెప్పమంటే మాత్రం డ్యాక్టర్లు నిరాకరించారు. ఏదైనా సాహసం చేసి పేరు తెచ్చుకోవాలని వుండొచ్చుగానీ, మరీ ఇంత సాహసమా!

- ప్రియ




సాయంత్రానికి యాపిల్‌పండ్ల స్టాక్ అయిపోయి నట్లు నంది కైలాస ద్వారం వద్ద బోర్డు పెట్టాడు. ఆ రోజు సాయంత్రం ఇంద్రుని ఆధీనంలోవున్న కామధేనువు ఇచ్చిన మధురమైన పాలు తాగి ఆకలి మంటను చల్లార్చుకున్నారు. ఆకలి వారికి చాలా థ్రిల్లింగ్‌గా అనిపించసాగింది.

నారదుడు దేవతలకు సలహా ఇచ్చాడు.

వంట చేయడానికి కావాల్సిన ముఖ్యమైన సరుకులు, పాత్రలు, గిన్నెలు, మూతలు, చెంచాలు, వంటల పుస్తకం గురించి లిస్టు చెప్పి భూలోకం నుండి వాటిని తెచ్చుకొమ్మని చెప్పాడు.

దేవతలందరివద్దా తగినంత బంగారం తీసుకుని ఇరువురు దేవతలు మర్నాడు ఉదయమే భూలోకం పయనమయ్యారు. సాధారణ మానవులవలె రూపం ధరించి భూలోకంలో వస్తువులు కొనుగోలు చేయమని వారికి తగిన జాగ్రత్తలు చెప్పాడు నారదుడు. సరుకులు, పాత్రలు కొనుగోలు చేసి గోనెసంచుల్లో వేసుకుని వారిరువురూ సాయంత్రానికి తిరిగివచ్చారు.

దేవతలందరి ముఖాలు ఆనందంతో వెలిగిపోతున్నాయి. ఎండు కట్టెలతో పొయ్యి రాజేసి వంట చేసారు. అన్నం మాడింది. మాడిన అన్నంలో ఉడికీ ఉడకని పప్పు వేసుకుని కలిపి ఆత్రంగా ముద్ద నోట్లో పెట్టుకున్నారు. కళ్లనీళ్ళ పర్యంతమైంది.

వంటల పుస్తకంలో చూసి తయారుచేసిన బీరకాయ కూరలో కారం ఎక్కువై కళ్లనుండి, ముక్కు నుండి నీరుకారి రొప్పుతున్నారు మరికొందరు దేవతలు. ఆకలి పూర్తిగా తీరక కడుపులో ఎలుకలు పరుగెత్తి నీరసంగా కళ్ళు తిరుగుతున్నట్లు అనిపిస్తోంది వారికి. చేదు దోసకాయతో కూర చేసి ఆ కూరను పారవేయలేక తినలేక అవస్థపడ్డారు.

ఈ విధంగా నెలరోజులపాటు ఉమ్మడిగా వంట చేసుకుని తిన్నారు. అందరికీ వంట చేయడం ఇప్పుడు బాగా అలవాటైంది. భూలోకంలో అత్తకోడళ్లకు, తోడికోడళ్లకు పనులు చేయడంలో ఎలా మన స్పర్ధలు వస్తాయో, దేవతలకు కూడా అలాంటి మన స్పర్ధలే వచ్చాయి.

భూలోకంలో వేరు కాపురాలు పెట్టుకున్నట్లు దేవతలు కూడా వేరు కుంపటి పెట్టుకోక తప్పలేదు. ఎవరి కుటుంబానికి వారు ఇప్పుడు సపరేట్‌గా వంట చేసుకుంటున్నారు. మరో మూడువారాలు గడిచేటప్పటికి అక్కడ సూపర్‌మార్కెట్ వెలిసింది. బందరు మిఠాయి, కాకినాడ కాజ, కోనసీమ కొబ్బరికాయల నుండి గుంటూరు మిర్చివరకు అన్నీ నాణ్యమైన సరుకులు లభ్యమవుతున్నాయి. కూల్‌డ్రింక్స్, బిస్కెట్లు, కేకులు, ఫాస్ట్‌ఫుడ్స్ పుష్కలంగా దొరుకుతున్నాయి.

ఇటీవల కలిగిన ఈ మార్పులన్నీ పార్వతీ పరమేశ్వరులు, నారదుని కళ్లముందు కదలాడాయి.

''అంతా శివలీల ప్రభూ!'' అంటూ వారికి నమస్కరించి మహతిని చేతబట్టి నారదుడు కైలాసంనుండి నిష్క్రమించాడు.

శివపార్వతులు మరోసారి కాఫీ సేవించి పదినిముషాలు లోకాభిరామాయణం ముచ్చటించారు. అపర్ణ వంట గదిలోకి తిరిగి వెళ్లింది.

పరమేశ్వరుడు స్నానం చేసి పూజ గదిలోకి వెళ్లాడు ధ్యానం చేసుకోవడానికి.

కైలాసం నుండి నారదుడు నేరుగా వైకుంఠం వెళ్లాడు.

ఇడ్లీలోకి చట్నీ నూరుతున్నాడు విష్ణుమూర్తి.

నారదుడ్నిచూసి బలవంతంగా నవ్వాడు.

''లక్ష్మీదేవి వంటగదిలో బిజీగా వుంది. కరెంటు పోయింది. అందుకని రోట్లో పచ్చడి నూరుతున్నాను'' అంటూ అడగని ప్రశ్నకు సంజాయిషీ ఇచ్చాడు. కిచెన్‌లో నుండి వచ్చింది లక్ష్మీదేవి.

''ఇంటి పనులు భార్యాభర్తలిద్దరూ చెరిసగం చేయాలన్నది మా పాలసీ నారదా. నేను ఇడ్లీ చేస్తే ఆయన చట్నీ చేయాలికదా!'' అన్నది లక్ష్మీదేవి.

''అవునవును'' అంటూ ఆమెను సమర్థించాడు నారదుడు. వైకుంఠంలో ఇడ్లీ తిని, మరోసారి ఫిల్టర్ కాఫీ తాగి వారి వద్ద సెలవు తీసుకున్నాడు నారదుడు.

బ్రహ్మలోకంలో పరిస్థితి మరో విధంగా వుంది.

''పొట్లకాయ పెరుగుపచ్చడి, ఆవపెట్టిన పనస కూర చేయమన్నానుకదా. ఎందుకు చేయలేదు?'' అంటూ ప్రశ్నిస్తున్నాడు బ్రహ్మదేవుడు.

రేపు చేస్తానని, ఈ రోజుకు ఫ్రిజ్‌లో ఉన్న బీరకాయ పచ్చడి, సాంబారుతో సరిపెట్టుకోమని సరస్వతీదేవి నెమ్మదిగా ప్రాధేయపడుతోంది. వారి సంభాషణ విన్న నారదునివైపుచూసి ఇబ్బందిగా నవ్విందామె.

''చూడు నారదా! ఒక్క పూట వంట చేయలేదని మీ పితృదేవులకు కోపం వచ్చింది. సామవేదం చదువుకుంటూ, కచ్ఛపి వీణను మీటుతూ వంట చేయడం మరచిపోయాను. ఇప్పుడు గుర్తుకువచ్చి గబగబా అన్నం వండాను. ఈ ఒక్క పూటకు నిల్వ కూరలు వేసుకుని తినమంటుంటే అలిగి అన్నం తినను అని పేచీ పెడుతున్నారు'' సరస్వతీదేవి నిష్పూ హాయంగా అంది.

భార్యమీద కోపం వచ్చి అలిగి ఏం చేయాలో తెలియక పిసి ముందు కూర్చుని ఇంటర్‌నెట్ చూస్తున్నాడు బ్రహ్మదేవుడు. అది చూస్తూ ఉంటే ఆయనకు కాలం తెలియదు. అంతగా నిమగ్నమవుతాడు అచ్చం భూలోకంలో స్టూడెంట్స్‌లాగా.

ఈ పూటకు సరిపెట్టుకుని భోజనం చేయమని బ్రహ్మదేవునికి నచ్చచెప్పాడు నారదుడు. ఫ్రిజ్‌లో సాంబారు తీసి నారదుడు వేడి చేసాడు. పళ్లెంలో

అన్నీ వడ్డించి బ్రహ్మదేవునికి అందించాడు. టీవీలో ప్రోగ్రామ్స్ చూస్తూ అన్నం తినడం బ్రహ్మకు అలవాటు. సరస్వతీదేవికి పుస్తకం చదువుతూ భోజనం చేయడం అలవాటు. ఆ పూట నారదుడు కూడా అక్కడే భోజనం చేసాడు.

సాయంత్రం బొబ్బట్లు చేయమని చెప్పాడు బ్రహ్మదేవుడు. సరేనని అన్నీ సిద్ధం చేసుకుంది సరస్వతి. ఏలకుల పొడి వేయాలా వద్దా అనే ఆలోచనలో పడింది. లక్ష్మీదేవికి ఫోన్‌చేసి అడిగితే వేయమని చెప్పింది. బొబ్బట్లు తయారు చేయసాగింది సరస్వతీదేవి.

రుచికరంగా వంటలు చేయడం, పిండివంటలు తయారు చేయడం ఇప్పుడు అందరికీ బాగా అలవాటైంది. ఉదయం లేవగానే కాఫీ త్రాగడం, చకచకా టిఫిన్ చేయడం, అన్నం కూరలు చేయడంలో దేవతలు నైపుణ్యం సాధించారు. అయితే గిన్నెలు తోమడానికి, బట్టలు ఉతకడానికి పని మనుషులు లేకపోవడంతో కొంత శ్రమ పడవలసి వస్తోంది. అందరి ఇళ్ళలోనూ ఇప్పుడు గ్యాస్‌స్టవ్‌లు, రెండు సిలిండర్లు వచ్చేసాయి. విద్యుత్ ఉపకరణాల వాడకం ఎక్కువైంది. మిక్సీలు, ఫ్రిజ్‌లు, డిష్‌వాషర్లు, వాషింగ్ మెషిన్ల వాడకం పెరిగిపోయింది. విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ఫలితంగా సూర్యుడు అధికంగా సౌరశక్తిని ఉత్పత్తి చేయవలసి వచ్చింది. మొదట్లో సూర్యుడు తన సౌరశక్తితో దేవతలందరి ఇళ్ళకూ ఉచితంగా విద్యుత్ సరఫరా చేసాడు. కానీ ఇప్పుడు కరెంటు వాడకం విపరీతంగా పెరిగిపోయి సూర్యదేవుని మదిలో అద్భుతమైన ఆలోచన వచ్చింది. వెంటనే తన ఆలోచనను ఆచరణలో పెట్టాడు. ఇప్పుడు సూర్యుడు విద్యుత్ వాడకానికి దేవతలవద్ద బంగారం వసూలు చేయసాగాడు.

ఇంద్రుడు కొంతకాలం కామధేనువు నుండి తీసిన పాలను అందరికీ ఉచితంగా సరఫరా చేసేవాడు. కానీ ఇప్పుడు పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, నెయ్యి.. ఏది కావాలన్నా ఇంద్రునికి కూడా మూల్యం చెల్లించుకోవలసి వస్తోంది. వైకుంఠంలో పాల సముద్రం ఉంది కాబట్టి ధైర్యంచేసి కొందరు దేవతలు వెళ్లి పాలు కావాలని అడిగారు. తీసుకువెళ్లమని చిరునవ్వుతో చెప్పాడు విష్ణుమూర్తి. ఉరిమి చూసింది లక్ష్మీదేవి. ఆ చూపులకు భయపడిన విష్ణుమూర్తి దేవతలవైపు చూసి పెదవి విరిచాడు సారీ చెబుతున్నట్లుగా.

విద్యుత్ సరఫరాను క్రమబద్ధం చేయడానికి సూర్యదేవుడు రోజుకు 2 గంటలు కరెంటు కోత విధిస్తున్నాడు. సౌరశక్తి కాబట్టి వర్షాకాలంలో కరెంటుకోత ఎక్కువగా వుంటుంది.

జలదేవునికి ఒక ఆలోచన కలిగింది. ఇంద్రుడు పాలు అమ్మినప్పుడు, సూర్యుడు సౌరశక్తిని అమ్మి సొమ్ము చేసుకుంటున్నప్పుడు, తాను నీటిని అమ్మితే బాగుంటుందన్న ఆలోచన కలిగింది. ఆ మర్నాటి నుంచి దేవతలు నీటి వినియోగానికి కూడా మూల్యం చెల్లించుకోవలసి వచ్చింది.

వాయుదేవుడు కూడా గాలిని అమ్మి సొమ్ము చేసుకోవాలని భావించాడు. ఈ విషయాన్ని చూచాయిగా తెలుసుకున్న కొందరు దేవతలు హనుమంతుడిని కలసి తమ గోడు వెళ్ళబోసుకున్నారు. వాయుదేవుడిని వారించమని హనుమను ప్రార్థించారు. హనుమ వెంటనే తన తండ్రిని కలసి ఆ ప్రయత్నాన్ని విరమింపజేసాడు. హమ్మయ్య అనుకున్నారు దేవతలు.

అందరు దేవతలు తమ శక్తిని అమ్మి బంగారం నిల్వలు పెంచుకోవాలని తాపత్రయపడుతున్నారు. ప్రతి వస్తువూ బంగారం మార్పిడితో కొనడంవల్ల అందరివద్ద బంగారం నిల్వలు తరిగిపోతున్నాయి. దేవతలవద్ద భోషాణాలలో వున్న బంగారంలో పదవ వంతు తరిగిపోయింది.


దేవతల మధ్య బంగారం మార్పిడికి సంబంధించి అవకతవకలు జరుగుతున్నాయని, దేవతలకోసం కరెన్సీ ముద్రించాలని ఆలోచనలో వున్నాడు కుబేరుడు. ఈ విషయంలో భారతదేశంలో రిజర్వు బ్యాంకులో కరెన్సీ ముద్రణకు సంబంధించిన అంశాలు పరిశీలించడానికి కుబేరుని రాజధాని అయిన అలకాపురి నుండి నలుగురు సభ్యులతో కూడిన బృందం బయలుదేరి వెళ్లింది. వారు తిరిగి వచ్చి తమ నివేదిక సమర్పించిన వెంటనే కుబేరుడు లక్ష్మీదేవితో చర్చించి కరెన్సీ ముద్రణకు సంబంధించి తుది నిర్ణయం తీసుకుంటాడు.

సూపర్‌మార్కెట్ ఒక్కటే ఉండడంవల్ల గుత్తాధిపత్యంతో రేట్లు పెంచుతున్నారు దానిని నిర్వహించే దేవతలు. ప్రక్కనే మరొక షాపు వెలిసింది. ఆ కిరణా షాపులో తూకంలో తేడా ఉంటుందని చాలామంది దేవతలు అంటున్నారు.


వంట మనుషులుగానీ, వంటలో బాగా అనుభవం వున్నవారుగానీ భూమిమీద నూకలు చెల్లి యమలోకం వస్తే యమధర్మరాజు వారికి శిక్ష విధించకుండా వారిచేత తమ ఇంట్లో వంట చేయించుకుంటున్నాడని, ఇందుకు యమధర్మరాజు భార్య ప్రోద్బలమే కారణమని రూఢిగా తెలిసింది.

ఇంద్రలోకంలో పరిస్థితి మరీ విచిత్రంగా తయారైంది. రంభ, ఊర్వశి, మేనక మొదలైన అప్సరసలు నాట్యం చేస్తుంటే చూడడానికి కనులకు ఇంపుగా ఉండేది ఒకప్పుడు. కానీ ఇప్పుడు స్వీట్స్, చిరుతిండ్లు, ఐస్‌క్రీములు, వేపుడు పదార్థాలు మొదలైనవి తినడం వల్ల వారికి ఒళ్ళు వచ్చింది. కొద్దిసేపు నాట్యం చేస్తే అలసి

## కమల్ పోటీ



ఏ విషయంలోనైనా తనే ముందుండా




లనే తపన కమల్‌హాసన్‌ది. ఆయనదొక ప్రత్యేకమైన స్టైల్ కూడా. అయితే ఇటీవల రజనీకాంత్ 'బాబా' చిత్రంకోసం ఓ జపాన్ అమ్మాయిని తీసుకొచ్చి నటింపజేస్తే నేనేం తక్కువ కాదంటూ కమల్ కూడా ఓ జపాన్ అమ్మాయిని 'పంచతంత్రమ్' సినిమాలో నటింపజేస్తున్నాడు. అంతేకాదు, బాబా కంటే ముందుగా తన సినిమా రిలీజ్ చేయాలని ఆలోచిస్తున్నాడట కూడా.

## కామెడీ రోల్

'పోలీస్ స్టోరీ' లాంటి హిట్ సినిమాలో విలన్‌గా నటించి అందరిచే శభాష్ అనిపించుకున్న సత్యప్రకాష్‌కు కామెడీ పాత్రలంటే ఎంతో ఇష్టమట. ఎప్పటికైనా కమెడియన్‌గా ఓ సినిమా చేయాలని ఉందిట. కానీ సత్యప్రకాష్‌ను కమెడియన్‌గా పెట్టుకోవడానికి నిర్మాతలు ముందుకు రావద్దూ!

\- ప్రియ





## మానేశా!

''బార్‌కెళదాం రారా, చెరో క్వార్టర్ బ్రాందీ తెచ్చుకుందాం'' అన్నాడు రమేష్.

''నేను మానేసి వారమయ్యిందిరా'' అన్నాడు ఉమేష్.

''ఎందుకని?''

''నేను క్వార్టర్ తాగేసరికి, నా భార్య హాఫ్ బాటిల్ తాగేస్తోంది. ఇక మానక ఛస్తానా!''

## షాపింగ్

భార్య ఆప్యాయంగా టిఫిను వడ్డించింది. బ్రూ కాఫీ ఇచ్చింది. బూట్లకు లేసులు కట్టింది. ఎక్కడ షాపింగ్‌కు వెళదామంటుందోనని భయపడుతూనే వున్నాడు భర్త.

''ఏమండీ! మధ్యాహ్నం ఆఫీసుకు సెలవు పెట్టేరండి. సినిమాకెళ్దాం.'' అంది భార్య.

''ఓ అలాగే!'' షాపింగ్ మాట ఎత్తనందుకు సంబరపడ్డాడు భర్త.

''త్వరగా వచ్చేయండి. సినిమా నుంచి వచ్చేప్పుడు ఓ పట్టుచీర కొందాం.''

## వయసు

విలేఖరి అడిగిన ప్రశ్నలకు జవాబులు చెపుతున్నది ప్రఖ్యాత సినీతార తార.

''ఇన్ని ప్రశ్నలు అడిగారు, నా వయసెంతో అడగరేం?'' అంది తార.

''మాకు తెలుసండీ, పదేళ్ళనుండీ ఇరవయ్యే కదా!'' అన్నాడు విలేఖరి.

## తెలివి

ఉన్నట్టుండి కరెంటు పోయింది.

''ఏమండీ! అగ్గిపెట్టె ఎక్కడుందో చెప్పండి'' అంది భార్య.

''ఏం తెలివే నీది! అగ్గిపుల్ల వెలిగించు. అగ్గిపెట్టె ఎక్కడుందో తెలుస్తుంది'' అన్నాడు భర్త.

**- కలవకుంట్ల గురునాథపిళ్ళై** (మదనపల్లె)


పోతున్నారు. వారిలో వృద్ధాప్యపు ఛాయలు కనిపిస్తున్నాయి. వారి నాట్యం చూడలేక అందరూ ఇబ్బంది పడవలసి వస్తోంది. ఇప్పుడు ఎవరూ వారి నాట్యాన్ని ప్రశంసించకపోవడంతో ఆత్మవిశ్వాసం లోపించి తమలో తామే కుమిలిపోతున్నారు ఇంద్రలోకంలోని అప్సరసలందరూ.

అమృతం ప్రభావం లేకపోవడంవల్ల దేవతలకు కూడా సాధారణ మానవులవలె తలనొప్పి, జ్వరం, విరోచనాలు మొదలైన అనారోగ్యాలు ప్రారంభమయ్యాయి. పదిమంది సీనియర్ దేవతలకు వృద్ధాప్యంవల్ల కాళ్ళనొప్పులు, కీళ్ళనొప్పులు, కళ్ళు మసగ్గా కనిపించడం మొదలైన అనారోగ్య చిహ్నాలు ప్రారంభమయ్యాయి. తరచుగా అస్వస్థతకు గురవుతున్న దేవతలకు చికిత్స చేయడానికి అశ్వనీ దేవతలు క్లినిక్‌లు పెట్టారు. అతి కొద్దికాలంలోనే అది నర్సింగ్‌హోమ్‌గా అభివృద్ధి చెందింది. 24 గంటలూ పని చేసే మెడికల్ షాపులు వెలిసాయి.

కొందరు దేవతలకు వయసు మీరడంవల్ల ముఖం మీద ముడతలు వచ్చాయి. ఫలితంగా స్త్రీలకు, పురుషులకు విడివిడిగా బ్యూటీక్లినిక్‌లు వెలిసాయి. బరువు తగ్గించే ఒబెసిటీ క్లినిక్‌లు కూడా కొత్తగా పెట్టారు. ఇంద్రలోకంలోని అప్సరసలు ఒబెసిటీ ట్రీట్‌మెంట్ తీసుకున్నా చెప్పుకోదగ్గర గుణం కనిపించడంలేదు.

ఈ విధంగా రెండేళ్ళు గడిచేటప్పటికి విసిగిపోయారు దేవతలు. జీవితమంటే ఏముంది? వండుకోవడం, తినడం, కడుక్కోవడం, నిద్రపోవడం... ఇంతకంటే జీవితానికి అర్థం, పరమార్థం ఏముంది అనిపించింది. ఇప్పుడు ఆకలి అంటేనే వారికి భయం కలుగుతోంది. జీవితం నిస్సారంగా అనిపిస్తోంది. అమృతం సేవించి హాయిగా వున్న ప్రాణానికి లేనిపోని కష్టాలు కొని తెచ్చుకున్నామని కుమిలిపోతున్నారు దేవతలు.

వినాయకునికి మాత్రం చాలా హేపీగా వుంది. పార్వతీదేవి పిండివంటలు చేసినప్పుడు గణేశ లోకానికి ఫోన్‌చేసి చెబుతుంది. భార్యల సమేతంగా వెళ్లి పిండివంటలు ఆరగించి వస్తాడు వినాయకుడు. మొన్నామధ్య వినాయకచవితికి అమెరికాలో వున్న ఆంధ్రుల ఇళ్ళకు వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు ఆర్గనైజర్, కాస్మెటిక్స్ మొదలైనవి తెచ్చి తల్లికి బహూకరించాడు. వినాయకుడు తనకు బహూకరించిన అమెరికా వస్తువులను చూసి మురిసిపోయింది అతని తల్లి. కుమారస్వామికి ఆవుపాలతో చేసిన స్వీట్స్ అంటే ఇష్టం. అప్పుడప్పుడు అతనికి ఇష్టమైన స్వీట్స్ చేసి కుమార లోకానికి పంపుతుంది తల్లి.




ఎవ్వరూలేని ప్రశాంతమైన వాతావరణంలో కూర్చుని రామ నామ ధ్యానం చేసుకుంటున్నాడు ఆంజనేయస్వామి. సెల్‌ఫోన్ మ్రోగడంతో కొద్దిసేపయ్యాక ఫోన్ అందుకున్నాడు. ఇంద్రుడు కుశలప్రశ్నలు అడిగి మధ్యాహ్నం లంచ్‌కు రమ్మని హనుమను ఆహ్వానించాడు. ఆంజనేయుడు చిరునవ్వు నవ్వాడు. జిహ్వా చాపల్యానికి దూరంగా వున్న మహానుభావుడాయన.

''నేను భోజనం చేయను. మీకు తెలుసుకదా'' అన్నాడు ఆంజనేయుడు విషయమేమిటో వెంటనే చెప్పమన్న అర్థంతో.

ఇంద్రుడు డైరెక్టుగా విషయంలోకి వచ్చాడు. కష్టపడి వస్తువులు సమకూర్చుకుని వంట చేసుకోవడం దేవతలకు చాలా ఇబ్బందికరంగా ఉందని, ఆర్థికపరంగా, ఆరోగ్యపరంగా, సౌందర్యపరంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, ఇందుకు పరిష్కారం తెలుపమని ఇంద్రుడు ప్రాధేయపడ్డాడు.

త్రిమూర్తులను శరణు వేడమని సలహా ఇచ్చి ఆంజనేయుడు సెల్‌ఫోన్ పక్కన పెట్టి మళ్ళీ ధ్యానంలో మునిగిపోయాడు. తమ అవివేకాన్ని క్షమించమని దేవతలందరూ త్రిమూర్తుల చరణాలను స్పృశించారు. మళ్ళీ అమృతం కావాలని వారిని శరణు వేడారు.

విష్ణుమూర్తి అన్నాడు- ''మళ్ళీ అమృతం కావాలని మీరు అడుగుతారని మాకు తెలుసు. అందుకే మీలో నిక్షిప్తమై వున్న అమృతాన్ని మా ముగ్గురి శక్తితో గ్రహించి ఈ కలశంలో భద్రపరిచాము. ఇందులో ఉన్న అమృతాన్ని తిరిగి సేవించడంవల్ల మీకు ఆకలి దప్పులు కలగవు. ఇకపై ఎలాంటి ఇబ్బందులు ఉండవు'' అంటూ కలశాన్ని తీసి అందరికీ చూపాడు.

అమృతంకోసం మళ్ళీ రాక్షసులతో కలిసి సాగర మధనం చేయాలేమో అని భయపడుతున్న దేవతలందరూ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు.

ఆత్రంగా అమృతాన్ని సేవించారు దేవతలు. ఆకలి లేకపోవడం ఇప్పుడు వారికి మరింత థ్రిల్లింగ్‌గా అనిపించసాగింది. ఇక ఎన్నటికీ తమకు ఆకలిదప్పులు కలగవని, వంట చేసుకునే బాధ, సరుకులు తెచ్చుకునే కష్టాలు, గిన్నెలు తోముకునే ఇబ్బంది ఉండదని ఆనందంతో కేరింతలు కొడుతున్నారు దేవతలందరూ.

★

సరదాగా వ్రాసిన ఈ కథను స్పోర్టివ్‌గా తీసుకుని హాయిగా నవ్వుకోవాలని సమస్త దేవతలకు మనవి చేస్తున్నాను. పాఠకులు, భక్తులు ఈ కథను ఈజీగా తీసుకోవాలని, ఈ కథలోని సన్నివేశాలు సరదాగా ఊహించినవని అందరికీ మనవి చేస్తున్నాను.

**-రచయిత**